సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 26 । జూలై । 2024





## పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి

విశాఖ: పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని ఉద్యోగులు విశాఖ పోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు.



## రాజభాష సమ్మాన్

విశాఖ: హిందీ భాష అమలుకు కృషి చేసిన సంస్థలకు ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో రాజభాష సమ్మాన్ అవార్డులు ప్రదానం చేశారు.



## బంగారు కాసులహారం

విశాఖ: సింహాచలేశునికి వరహాలరెడ్డి 15 గ్రా. బంగారు కాసుల హారం, 750 గ్రా. వెండి అష్టలక్ష్మి కలశం బహూకరించారు.

## న్యూస్‌రీల్

### తాచేరు డైవర్షన్ రోడ్డు మీదుగా రాకపోకలు



రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలోని తాచేరు డైవర్షన్ రోడ్డుపై నుంచి వాహనాల రాకపోకలకు అధికారులు గురువారం అనుమతించారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు తాచేరు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించి రోడ్డుకు గండి పడింది. దీంతో వాహనాల రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో గండిని పూడ్చి గ్రావెల్ వేసి లెవెలింగ్ పనులు చేపట్టారు. పనులు పూర్తవడంతో తాజాగా వాహనాల రాకపోకలకు అనుమతిచ్చారు. దీంతో భీమునిపట్నం–నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వాహనాల రాకపోకలకు మళ్లీ మొదలయ్యాయి.

### పోలీసులకు జవాబుదారీతనం ఎంతో ముఖ్యం : ఎస్పీ దీపిక



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి: ఫిర్యాదీల పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. అనకాపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆమె గురువారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులకు సానుకూలంగా స్పందించి చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని, ఎటువంటి అలసత్వం ఉండకూడదని చెప్పారు. దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు పగలు, రాత్రి గస్తీలను పునర్వ్యవస్థీకరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు రవాణా జరిగే మార్గాలలో ఆకస్మిక, డైనమిక్ తనిఖీలు నిర్వహించాలని ఆమె కోరారు. డీఎస్పీ ఎస్.అప్పలరాజు, సీఐ ధనుంజయరావు, ఎస్ఐ తేజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### 28న పెద్దేరు నీటి విడుదల

మాడుగుల: మండలంలోని రావిపాలెం వద్ద పెద్దేరు జలాశయం ఆయకట్టు రైతుల తీర్మానం మేరకు ఖరీఫ్ వరి నాట్లకు సాగునీరు విడుదల చేయనున్నట్లు జేఈ సుధాకర్‌రెడ్డి గురువారం మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఆర్‌ఎంసీకి 40 క్యూసెక్కులు, రాచకట్టుకు 40 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తామన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

**తాండవ నీటిపై నేడు సమావేశం**

నాతవరం: తాండవ రిజర్వాయర్ నుంచి ఖరీఫ్ సాగుకు నీటి విడుదల తేదీ ఖరారు చేసేందుకు ఆయకట్టు రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డీఈ అనురాధ తెలిపారు. మండల కేంద్రంలోని గల తాండవ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందన్నారు. ఆయకట్టు రైతులంతా హాజరు కావాల్సిందిగా కోరారు.

### ఎస్‌ఆర్‌వో భవనాలకు స్థలం కోసం కలెక్టర్‌కు వినతి

- కె.కోటపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ తనిఖీల్లో జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి

కె.కోటపాడు: జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కె.కోటపాడు, మాడుగుల, నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా(ఎస్‌ఆర్‌వో)లకు సొంత భవనాల నిర్మాణం కోసం స్థలాలను సమకూర్చాల్సిందిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను కోరినట్లు అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ జానకీదేవి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆమె వచ్చారు. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయ వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఇప్పటి వరకు ఈ ఏడాది లక్ష్యంలో 49.66 శాతం ఆదాయాన్ని సాధించినట్లు వెల్లడించారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికలతో పాటు, ప్రస్తుతం మంచి రోజులు లేక పోవడం రిజిస్ట్రేషన్లపై ప్రభావం చూపిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మౌలిక వసతులను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె వెంట స్థానిక సబ్ రిజిస్ట్రార్ బి.వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శంకరరావు ఉన్నారు.

---

యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న అనుమతి లేని ఓ పిల్లల ఆస్పత్రికి కొద్ది రోజుల క్రితం వి.మాడుగుల నుంచి మగ శిశువును వైద్యం కోసం తీసుకొచ్చారు. వచ్చీ రాని వైద్యం చేయడంతో ఆరోగ్యం విషమించి శిశువు ప్రాణాలు కోల్పోయాడు. ఆ తర్వాత అనకాపల్లిలోని ఓ పిల్లల వైద్య నిపుణుడికి బిడ్డ తల్లిదండ్రులు విషయం చెప్పారు. యలమంచిలి ఆస్పత్రిలో చేసిన వైద్యం గురించి వివరిస్తే ఇదేం ట్రీట్‌మెంట్ అని ఆ పీడియాట్రీషియన్ ఆశ్చర్యపోయారు.

ఆరు నెలల క్రితం యలమంచిలి మండలం పీఎస్‌ఆర్ పేటకు చెందిన రైతుకు జ్వరం వస్తే సమీప గ్రామంలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. కొన్ని మందులిచ్చి తగ్గిపోతుందని చెప్పడంతో అంతా ధీమాగా ఉన్నారు. ఆ రైతుకు అప్పటికే పచ్చకామెర్ల వ్యాధి ముదిరిపోయినా వైద్యుడు గుర్తించలేకపోయారు. పరిస్థితి విషమించి మరుసటి రోజే రైతు మృతి చెందాడు.

ఇవన్నీ అర్హతలేని వైద్యంతో జిల్లాలో జరిగిన **కొన్ని దుర్ఘటనలు** మాత్రమే. వచ్చీరాని వైద్యంతో నిర్వహిస్తున్న **ఆస్పత్రుల కారణం**గా వెలుగులోకి రాని మరణాలెన్నో ఉంటు**న్నాయి. వైద్యో** నారాయణో హరి.. అంటే వైద్యులు దేవుడి**తో సమానం అని** అర్థం. అలాంటి పవిత్రమైన వృత్తికి కొందరు **మచ్చ** తెస్తున్నారు. అర్హత లేకపోయినా వైద్యం చేసి **ప్రజల** ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.





పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఆస్పత్రులు

# వీధి వీధికో శంకర్‌దాదా

- నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు, ఆస్పత్రుల నిర్వహణ
- పట్టా లేకుండానే డాక్టర్ అవతారం
- వచ్చీరాని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటం
- జిల్లాలో నకిలీ డాక్టర్ల బెడద
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

యలమంచిలి రూరల్:

జిల్లాలో శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లు ఎక్కువైపోయారు. క్లినిక్‌లు నిర్వహిస్తూ డాక్టర్లుగా చలామణీ అవుతున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీలు ఆపరేషన్ల వరకు కానిచ్చేస్తున్నారు. దీంతో ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు ఎంబీబీఎస్ డాక్టర్ అవతారం ఎత్తుతున్నారు. కొందరు ఎటువంటి అనుమతులు లేకుండానే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులంటూ బోర్డులు పెట్టేస్తున్నారు. వచ్చీరాని వైద్యం చేయడంతో రోగి పరిస్థితి చేయి దాటితే మరో ఆస్పత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇలా ఆరోగ్యం విషమించిన రోగులను ఎక్కువగా సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రులకే పంపిస్తున్నారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వాస్పత్రు**లకు వెళుతున్న** వారు **అక్కడ ప్రాణాలు** కోల్పో**తున్నారు. దీంతో** ప్రభుత్వాస్పత్రు**లకు చెడ్డపేరు** వస్తోం**ది. నకిలీ వైద్యం** అందించిన ప్రైవేటు వైద్యులు మాత్రం యథావిధిగా తమ పని కానిచ్చేస్తూ అందినకాడికి ప్రజల నుంచి దోచుకుంటున్నారు. ఈ తతంగమంతా ఏదో మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్నదనుకుంటే పొరపాటే. జిల్లా కేంద్రం అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం వంటి పట్టణాలు సహా అన్ని మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో అర్హతలేని వైద్యులు వందల సంఖ్యలో ఉంటున్నారు. ఇటీవల కాలంలో అనుమతిలేని ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**నోటీసులతో సరి..**

నిబంధనల ప్రకారం అధికారులు ప్రతి మూడు నెలలకొకసారి ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేయాలి. ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలి. గడువు ముగిసిన ఆస్పత్రులు రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ఆస్పత్రులకు అధికారులు నోటీసులిచ్చి వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. **ఆస్పత్రుల పేరొకటి.. చేస్తున్న చికిత్స ఒకటిగా ఉంటోంది. రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పుడు పేర్కొంటున్న డాక్టర్ ఆ తర్వాత అక్కడ కన్పించడం లేదు. రోగులకు వసతులు, శిక్షణ పొందిన పారా** మెడికల్, స్టాఫ్ నర్సులు ఉండాలి. బయోవ్యర్థాలను ధ్వంసం చేసే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాలి. జిల్లాలో ఎక్కువ శాతం ఆస్పత్రుల్లో ఈ నిబంధనలు పాటించడంలేదనే ఆరోపణలున్నాయి. యలమంచిలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో అర్హతలేని వైద్యుడొకరు ఏకంగా తల్లీ పిల్లల ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు.

### ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

అర్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎక్కడైనా ఆర్‌ఎంపీలు, అనుమతి లేని ఆస్పత్రుల వలన ఇబ్బందులు వస్తే మాకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి అనుమతిలేని ఆస్పత్రులు, క్లినిక్‌లను మూసివేస్తాం.

–డాక్టర్ ఎం.వి.ఎస్.కె.బాలాజీ,
ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో

### 900కు పైగా అనుమతి లేని ఆస్పత్రులు





యలమంచిలిలో అనుమతి లేని తల్లీ పిల్లల క్లినిక్

ఎవరైనా ఆస్పత్రి గానీ, క్లినిక్, ల్యాబ్, స్కానింగ్ సెంటర్ గానీ ఏర్పాటు చేయాలంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద మొదట రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అనుమతి తీసుకున్న సెంటర్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. అనుమతులున్న ల్యాబ్‌లు, స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లలో ఏయే పరీక్షలకు ఎంత రుసుము వసూలు చేయాలో తెలిపే బోర్డును ప్రదర్శించాలి. ఇదెక్కడా అమలు కావడం లేదు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ వద్ద 152 ఆస్పత్రులు రిజిస్టర్ అయ్యాయి. అందులో క్లినిక్‌లు 49 , పోలి క్లినిక్‌లు 12 , 20 పడకల కన్నా తక్కువ బెడ్లు ఉన్న ఆస్పత్రులు 70, 21 నుంచి 50 బెడ్ల వరకు అనుమతి ఉన్నవి 19, 51 నుంచి 100 బెడ్ల వరకు అనుమతి పొందినవి 2 ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లావ్యాప్తంగా సుమారు 900కి పైగానే అనుమతులు లేని ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. ల్యాబులు యథేచ్ఛగా నడుపుతున్నారు. ఆస్పత్రుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే రోగులు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది.

జిల్లాలో చాలా చోట్ల ఆర్‌ఎంపీలు క్లినిక్‌ల పేరిట నాలుగైదు గదుల్లో పడకలు ఏర్పాటు చేసి, ఖరీదైన వైద్య సేవలందిస్తున్నారు. ఆస్పత్రుల పక్కనే మెడికల్ షాపులు ఏర్పాటు చేయించి, నిర్వాహకులతో కమీషన్లు దండుకుంటున్నారు. చాలా వరకు ప్రైవేటు ఆస్పత్రులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నుంచి అనుమతులు లేవు. అలాగే అగ్నిమాపక శాఖ నుంచి కూడా ఫైర్ సేఫ్టీ నిరభ్యంతర పత్రాలు తీసుకోవడంలేదు. ఆస్పత్రుల నుంచి బయోవేస్టును ఇష్టానుసారంగా పడేస్తుండడంతో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది.

## సహకార సంఘాల బలోపేతంపై దృష్టి

- ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణ
- గత ఆర్థిక సంవత్సరం రూ.1.6 కోట్ల నికర లాభం
- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విశాఖ విద్య : సహకార సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. డీసీసీబీ మహాజన సభ గురువారం మర్రిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని డీసీసీబీ కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.1.6 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ మహాజన సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటం ద్వారానే వాటిని బలోపేతం చేయటం సాధ్యమవుతుందన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల బాధ్యులు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

డీసీసీబీకి అనుబంధంగా ఉన్న బ్యాంకులు ఆర్థిక కార్యకలాపాలను విస్తృతం చేయాలన్నారు. సహకార సంఘాల ద్వారా ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ఎరువుల విక్రయశాలలు, జన ఔషధ కేంద్రాలు, ఎం.పి.ఎఫ్.సీ గోదాములు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ అందిపుచ్చుకోవాలన్నారు. బ్యాంకుల కంప్యూటరీకరణ సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. కంప్యూటరీకరణతో సేవలు మరింత సులభతరం అవుతాయని, అదేవిధంగా డీసీసీబీ కార్యకలాపాలు మరింత పారదర్శకత ఉంటుందన్నారు. బ్యాంకుల పరిధిలో అవసరాలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించటం ద్వారా ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. సమావేశంలో బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ, అనకాపల్లి జిల్లా సహకార శాఖ అధికారి ప్రేమ స్వరూపరాణి, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

## క్షణికావేశంలో తప్పిదాలు

- అదుపు తప్పితే జైలుపాలు
- న్యాయమూర్తి రమేష్



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

అనకాపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పిదాల వల్ల కొంతమంది వ్యక్తులు జైలు పాలవుతారని మొదటి అదనపు జూనియర్ సివిల్, 11వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఎ.రమేష్ అన్నారు. స్థానిక సబ్‌జైల్లో మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో పాన్‌ఇండియా కార్యక్రమంలో భాగంగా జైల్లో బాల నేరస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనకాపల్లి సబ్ జైల్లో బాలలెవరూ లేరని గుర్తించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని పేర్కొన్నారు. ఖైదీల సమస్యలు కోర్టు దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరామ్, రోజా, తులసి తదితరులు పాల్గొన్నారు.

## విజయీభవ

సాగరతీరంలో జాతీయ జెండాలతో క్రీడాభిమానులు



విశాఖ స్పోర్ట్స్: పారిస్‌లో శుక్రవారం ప్రారంభం కానున్న విశ్వ క్రీడావేదికపై భారత జాతీయ పతాకం రెపరెపలాడాలని విశాఖ క్రీడాభిమానులు ఆకాంక్షించారు. ఈ సారి ఒలింపిక్స్ పోటీలకు దేశం నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు తమ ప్రతిభ చూపేందుకు సిద్ధమయ్యారు. వీరిలో విశాఖకు చెందిన జ్యోతి యర్రాజి వుమెన్ వంద మీటర్ల హర్డిల్స్‌లో, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ సింగిల్స్‌లో సత్తా చాటేందుకు బరిలో దిగుతున్నారు. సాత్విక్ రాజ్ మెన్ డబుల్స్‌లో, ధీరజ్ మెన్ రికర్వ్ ఆర్చరీలో, టీటీలో ఆకుల శ్రీజతో పాటు జ్యోతిక శ్రీ వుమెన్ నాలుగువందల మీటర్ల రిలేలో జట్టుగా పోటీపడుతున్నారు. విశాఖ క్రీడాభిమానులు గురువారం సాగరతీరంలో జాతీయ జెండాలు ప్రదర్శించి.. క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

## యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు

# అటానమస్ హోదా





- జిల్లాలో స్వయం ప్రతిపత్తి పొందిన తొలి కాలేజీ
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితం



గురుజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఇన్‌సెట్) సిలబస్ రూపకల్పన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రేమ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ స్టేటస్ (స్వయం ప్రతిపత్తి హోదా) ఈ విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ చంద్రశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య, సౌకర్యాల కల్పనకు అప్పటి సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. దీంతో ఈ కళాశాలకు నాక్ ఏ గ్రేడు లభించింది. అదే క్రమంలో కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదానిస్తూ గత ఏడాది నవంబరు 13న యూజీసీ ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పదేళ్లు అంటే 2033–34 వరకు అటానమస్ హోదా కొనసాగుతుంది. దీంతో ఈ సంవత్సరం నుంచి దీనిని అమలు చేయడానికి వీలుగా కళాశాల అధికారులు చర్యలు ప్రారంభించారు. స్వయం ప్రతిపత్తి హోదా ఉన్న విద్యాసంస్థలకు.. సిలబస్, ప్రశ్నపత్రాలు రూపొందించుకుని, జవాబు పత్రాల మూల్యాంకనం చేసి, సర్టిఫికెట్లు జారీ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం తాత్కాలికంగా ఇచ్చిన అటానమస్ హోదా ప్రకారం నిబంధనలు పాటించి నాణ్యమైన విద్యనందిస్తే మరోసారి హోదా పెంచడం కానీ, శాశ్వతంగా అటానమస్ హోదా ఇవ్వడం కానీ జరుగుతుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అటానమస్ హోదా అమలు చేయడానికి ముందుగా అవసరమైన సిలబస్ రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. ఇతర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన సీనియర్, విశ్రాంత అధ్యాపకులు, ఆచార్యుల సలహాలు, సూచనలతో సిలబస్‌ను రూపొందిస్తున్నామని, దశలవారీగా స్వయంప్రతిపత్తి హోదాను పకడ్బందీగా అమలు చేస్తామని, ఈ ప్రాంత విద్యార్థులు దీనిని సద్వినియోగపర్చుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నత విద్యలో చేపట్టిన సంస్కరణల ఫలితంగానే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉన్న యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా వచ్చిందని స్థానిక విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

## ఆధునిక వ్యవసాయంతో

# మంచి దిగుబడి



వరి నారుమడులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు (ఇన్‌సెట్) లక్ష్మీపురంలో రైతులతో సమావేశం

చోడవరం: ఖరీఫ్ సీజన్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీపురంలో సస్యరక్షణ చర్యలపై గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో సాగు వల్ల మెరుగైన దిగుబడి వస్తుందన్నారు. రైతులకు ఫౌండేషన్ సీడ్ ఇచ్చి, వారే విత్తనాలు ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి విక్రయించడం, సర్టిఫైడ్ సీడ్ సబ్సిడీ రూపంలో రైతులు పొందేలా దిశానిర్దేశం చేశారు. విత్తనోత్పత్తి ద్వారా రైతులకు విత్తనాల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రావన్నారు. విత్తనోత్పత్తి చేసే రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌లో వరి నాట్లు వేసేటప్పుడు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఇప్పటికే రైతులకు కావలసిన వరి విత్తనాలు అందించామన్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో వరి నారుమడులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నారు సిద్ధంగా ఉన్న రైతులు దమ్ములు పట్టి నాట్లు వేసుకోవచ్చన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ సిబ్బంది ఇచ్చే సూచనల్ని పాటించడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి పావని, విజేత, వ్యవసాయ విస్తరణాధికారులు త్రివిక్రమ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'నవోదయ' పిలుస్తోంది

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16 చివరి తేదీ
- వచ్చే జనవరి 18న ప్రవేశ పరీక్ష


స్మార్ట్ క్లాస్‌రూమ్


కొమ్మాదిలోని నవోదయ ప్రాంగణం

**కొమ్మాది(విశాఖ):** కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమ విద్యనందిస్తున్న ప్రభుత్వ రంగ విద్యాసంస్థ జవహర్ నవోదయ విద్యాలయం . ఇక్కడ చదువుతోపాటు ఐఐటీ ప్రవేశ పరీక్షకు శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు తదితర అంశాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ విద్యాలయంలో చదివే ప్రతి ఒక్కరికీ బంగారు భవిష్యత్ ఉంటుందని తల్లి దండ్రుల నమ్మకం. దీంతో ఈ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది. పక్కా ప్రణాళిక, కఠోరమైన సాధన చేస్తే తప్ప ఈ విద్యాలయంలో 6వ తరగతిలో సీటు సాధించలేం. ఇక్కడ విద్యాభ్యాసం ఎలా ఉంటుంది, దైనందిక కార్యక్రమాలు, వసతి, భోజన సౌకర్యాలు తదితర అంశాలపై ఓ లుక్ వేద్దాం.

కొమ్మాది నవోదయ విద్యాలయం.. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో విద్యనందిస్తున్న సంస్థ. ఈ పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో మూడు, నాలుగో తరగతి చదివి.. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 80 సీట్లలో రూరల్ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం కేటాయిస్తారు. ఈ స్కూలులో చేరేందుకు 100 మార్కులతో కూడిన ప్రవేశ పరీక్ష ఉంటుంది. మేధాశక్తి పరీక్షకు 50 మార్కులు, గణిత పరీక్షకు 25 మార్కులు, భాషా పరీక్షకు 25 మార్కులు ఉంటాయి.

**అందుబాటులో అన్ని సౌకర్యాలు**

విద్యార్థులు తమ అవసరాల కోసం బయటకు వెళ్లనవసరం లేదు. అన్నీ విద్యాలయంలోనే అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు అనారోగ్యానికి గురైనా ప్రాంగణంలోనే ప్రత్యేక మెడికల్ రూమ్‌లో స్టాఫ్ నర్స్ ద్వారా ప్రాథమిక చికిత్సను అందిస్తారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైతే నగరంలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తారు. విద్యార్థులకు దుస్తులు, షూ, రెండు జతల స్పోర్ట్స్ దుస్తులు, బెడ్ షీట్, టవల్, పుస్తక సామగ్రితో పాటు విద్యార్థికి కావాల్సిన అన్ని వసతులు ఉచితమే.

**అత్యుత్తమ విద్యాబోధన**

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. సాంకేతిక విద్యను అందిస్తారు. శాంసంగ్ సౌజన్యంతో 41 ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి.. ప్లాస్మా టీవీ, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు. ఉత్తమ సంస్కృతి విలువలను పెంపొందించడం, పర్యావరణంపై అవగాహన, క్రీడలు, వ్యాయామ విద్యలో శిక్షణ, హిందీ, ఆంగ్లం, తెలుగు భాషల్లో తగిన నైపుణ్యాలను పెంపొందించడం, వలస విద్య (మైగ్రేషన్) విధానం ద్వారా హిందీ రాష్ట్ర విద్యార్థులను హిందీయేతర రాష్ట్రాలకు పంపించి జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించడం, వ్యాసరచన, వ్యక్తృత్వ, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాల ప్రదర్శన తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ, వివిధ క్రీడల్లో పోటీల నిర్వహణ, వారంలో ఓ రోజు విద్యార్థులకు ఇంటర్ హౌస్ పోటీల నిర్వహణ , బాలికల స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, శాస్త్రీయ, జానపద నృత్యాలపై అభిలాష ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. 10 వేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన అధునాతన గ్రంథాలయం అందుబాటులో ఉంది.

**వసతి సౌకర్యం ఇలా..**

తరగతి గదిలో బాలురు, బాలికలు కలసి చదువుకుంటారు. వసతి, భోజనశాలలు వేర్వేరుగా ఉంటాయి. ఉపాధ్యాయులే అదనపు బాధ్యత తీసుకుని వార్డెన్‌గా వ్యవహరిస్తారు. 16 మంది ఉపాధ్యాయ బృందంలో రోజుకు 8 మంది చొప్పున పనిచేస్తూ వారి యోగక్షేమాలు పర్యవేక్షిస్తారు.

### జనవరిలో ప్రవేశ పరీక్ష

జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు 2013 మే1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలి. https:// navodaya. gov. in/ nvs/en/ Home1 వెబ్‌సైట్‌ను సందర్శించి.. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 2025 జనవరి 18వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది.


వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

## ఒలింపిక్స్‌లో విజయాన్ని ఆకాంక్షిస్తూ సంతకాల సేకరణ


సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సుధాకర్


వ్యాయామ ఉపాధ్యాయిని దేవిని సన్మానిస్తున్న గ్రంథాలయ అధికారి దమయంతి

**నర్సీపట్నం:** ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆల్ ది బెస్ట్ ఆఫ్ ఇండియా కార్యక్రమం ద్వారా స్థానిక గ్రంథాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మనదేశ క్రీడాకారులకు సంతకాల సేకరణతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న క్రీడాకారులు ప్రతిభ చూపి మనదేశ కీర్తిని నలుదిశలా వ్యాపింపజేస్తారని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. ఎంఈవోలు నాగేంద్ర,వరహాలబాబు మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో మనక్రీడాకారులు సత్తా చాటాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో ఇచ్చే పతకాల ప్రాముఖ్యతను వివరించారు. విశ్రాంత అధ్యాపకులు యలమంద, విశ్రాంత ఎంపీడీవో శ్రీరామ రాజు, విశ్రాంత గ్రంథాలయ అధికారులు కె.త్రిమూర్తులరెడ్డి, మురళీకృష్ణ ఒలింపిక్స్ ఆవశ్యకత గురించి వివరించారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో వెండి పతకం సాధించిన చెట్టుపల్లి జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయిని జి.దేవిని సత్కరించారు. విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువతీయువకులు సంతకాల ద్వారా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, నారాయణ మూర్తి, పీడీలు శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

- డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శచీదేవి

**నర్సీపట్నం:** జిల్లాలోని పొదుపు సంఘాలకు చెందిన 6,500 మంది మహిళలను లక్షాధికారులను చేసేందుకు కార్యాచరణ రూపొందించామని డీఆర్డీఏ పీడీ శచీదేవి తెలిపారు. వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఏపీఎంలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధికి సిబ్బందికి కృషి చేయాలన్నారు. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. లఖ్‌పతి ఎంటర్ ప్రైజెస్ షాపుల ఏర్పాటుకు గత ఏడాది 688 మంది డ్వాక్రా సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది 6,500 మహిళలను లక్షాధికారులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. వీరికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు బ్యాంక్‌ల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ముందుకు వచ్చినట్టు ఆమె తెలిపారు. జిల్లాలో 40,462 గ్రూపులు ఉండగా 4,43,000 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఈ సంఘాల్లోని సభ్యులకు బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ.143 కోట్ల మేర రుణాలు అందిస్తున్నట్టు చెప్పారు. నకిలీ గ్రూపుల పేరుతో అనకాపల్లిలో బ్యాంక్‌ల్లో కొందరు రుణాలు పొందారని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా వెరిఫికేషన్ తరువాత గ్రూపులకు రుణాలు ఇప్పించాలని ఆదేశించినట్టు చెప్పారు. ఉన్నతి కార్యక్రమం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ. 50 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. గత ఏడాది రూ.7 కోట్లు ఇచ్చామని, ఈ ఏడాది రూ.8.64 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ డైజీ, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో ప్రమాదాలపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న రాజాన దొరబాబు

**అనకాపల్లి:** జిల్లాలో ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో జరుగుతున్న వరస ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికుల ప్రాణాలు కోల్పోతున్నా జిల్లా అధికార యంత్రాంగం కనీస చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. ప్రమాదకరమైన పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు యాజమాన్యాలు కనీస భద్రత సౌకర్యాలు కల్పించడం లేదని, దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులు ఎక్కువశాతం మరణిస్తున్నారని చెప్పారు. పరిశ్రమల ఇన్‌స్పెక్టర్, జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశ్రమల యజమానులతో లాలూచీ పడడం వల్లే ఇటువంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కె.త్రినాథ్, జిల్లా నాయకులు విత్తనాల పోతురాజు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు అన్యాయం


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

**తుమ్మపాల:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మనరాష్ట్రానికి, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యదర్శివర్గ సభ్యుడు జి.కోటేశ్వరరావు అన్నారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలపై హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయలేదని, స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు కేటాయించలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించలేదని తెలిపారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడమంటే అప్పుగానే భావించాల్సి ఉంటుందన్నారు. టీడీపీ, జనసేనలు రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యాయని దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు, నాయకులు గండి నాయనబాబు, డి.శ్రీనివాసరావు, బి.నూకఅప్పారావు, పి.చలపతి పాల్గొన్నారు.

## రహదారి కోసం గిరిజనుల ఆందోళన

- గెడ్డలో దిగి నిరసన


గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేస్తున్న బొర్రచింత గిరిజనులు

**దేవరాపల్లి:** తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ మండలంలోని వాలాబు పంచాయతీ శివారు బొర్రచింత గిరిజనులు గురువారం ఆందోళన చేశారు. గ్రామానికి ఆనుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలో దిగి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామానికి చేరుకోవాలంటే గెడ్డలో దిగి వెళ్లాలని, భారీ వర్షాల సమయంలో గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు సాగించే అవకాశం ఉండదన్నారు. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నరకయాతన అనుభవిస్తున్నామని చెప్పారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం దాటి బయటకు వెళ్లి పరిస్థితి లేక తిండి గింజలు లేక నరకయాతన అనుభవిస్తున్నామని తెలిపారు. తమ పిల్లలు స్కూల్‌కు వెళ్ల లేకపోతున్నారని, వైద్యం అందక దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జలదిగ్బంధంలో చిక్కుకున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని, గెడ్డపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మడుగు మచ్చిరాజు, టుకూరు రాములు, ముర్ల పైడితల్లి, నూకరాజు, దేవరాజు,భీమరాజు,గణేష్ పాల్గొన్నారు.

## రేపు జెడ్పీ సర్వ సభ్య సమావేశం

**మహారాణిపేట(విశాఖ):** విశాఖ జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. అన్ని శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధం కావాలన్నారు.

## తాండవ ప్రధాన కుడి కాలువకు గండి ముప్పు

- ఆయకట్టు రైతుల ఆందోళన


తాండవ కుడి కాలువపై నిర్మించిన ఆక్విడెక్టు

**నాతవరం:** తాండవ రిజర్వాయరు ప్రధాన కుడి కాలువ మార్జిన్‌లో గండి పడే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల ఏర్పడిన తుపాను సమయంలో కురిసిన భారీ వర్షాలకు చమ్మచింత వద్ద తాండవ నది కుడి కాలువపై నిర్మించిన ఆక్విడెక్టు వద్ద రంధ్రం ఏర్పడింది. ఈ రంధ్రం మరింత పెద్దదిగా మారితే తాండవ కుడి కాలువ ద్వారా ఆయకట్టుకు ప్రవహించే నీరు పూర్తిగా నిలిచిపోతుంది. తాండవ నదిపై 30 అడుగుల ఎత్తులో కుడి కాలువ ద్వారా ఆయకట్టుకు నీరు తరలించేందుకు వంతెనతోపాటు ఆక్విడెక్టు నిర్మించారు. ఆక్విడెక్టు సమీపంలో ఏర్పడిన రంధ్రం కారణంగా నీరు ప్రవహించే కాలువ బీటలు వేసి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ సమయంలో ఇక్కడ ఆక్వాడెక్టు కాలువ కూలితే కుడి కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాలకు నీరు ప్రవాహం నిలిచిపోతుంది. ఈ కుడి కాలువ ద్వారా నాతవరం మండలంలో చమ్మచింత, పాట్టి నాగన్నదొరపాలెం, కె.వి.శరభవరం, గుమ్మడిగొండ, వెదురుపల్లి, పెద గొలుగొండపేట, చిన గొలుగొండపేట, కృష్ణాపురం, గునుపూడి, ఎస్.బి.పట్నం, పి.జగ్గంపేట, పి.కె.గూడెం, కొండధర్మవరం, కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో లక్ష్మీపురం అల్లిపూడి, కోటనందూరు, రవతలపూడి మండలంలో కె.ఈ.చిన్నయ్యపాలెం, ములగపూడి, రాజవరం, రామకృష్ణాపురంతోపాటు పలు గ్రామాల పరిధిలో ఆయకట్టుకు తాండవ నీరు సరఫరా అవుతోంది. ఇదే సమయంలో రంధ్రం పూడ్చకపోతే ఏమాత్రం వర్షాలు కురిసినా అక్కడకు వాహనాలు రాకపోకలు సాగించే అవకాశం ఉండదు. తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేశాక కాలువ కూలిపోతే నీరు వృథాగా పోతుంది. దాన్ని అరికట్టడానికి ఇసుక బస్తాలు సైతం తరలించడం కష్టతరంగా ఉంటుందని ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బాలల పురస్కారానికి దరఖాస్తు గడువు పొడిగింపు

**విశాఖ విద్య:** జాతీయ బాలల పురస్కారానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు ఇలా ఏ రంగంలో అయినా ప్రావీణ్యాన్ని చాటుకుంటున్న 5–18 ఏళ్ల వయసు గల వారు బాలల అవార్డు దక్కించుకోవచ్చన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో https://awards.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల బాలల ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, దీనిపై పాఠశాలల స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు సూచించారు.

## ఇసుక కొరతపై సిటు ధర్నా


ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

**నర్సీపట్నం:** నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో నెలకొన్న ఇసుక కొరతను తీర్చాలని భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మికులతో కలిసి గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇసుక కొరతను తీర్చాలని నినాదాలు చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఇసుక యార్డు అక్రమాలపై విచారణ చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా యార్డులో ఇసుక సరఫరా నిలిపివేయటంవల్ల నిర్మాణదారులుఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. అక్రమాలపై వెంటనే నిగ్గుతేల్చి, ఇసుకను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.అనంతరంఆర్డీవోకు హెచ్.వి.జయరాంకు వినతిపత్రం అందజేశారు.

# సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేట్ ఏడీఆర్ ముకుందరావు

**అనకాపల్లి:** పంటలకు చీడపీడలు పట్టకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పంటపొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుంద రావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో గురువారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారుమడిలో జల్లిన విత్తనం మూడు రోజుల కన్నా ఎక్కువ సమయం నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని ఆయన చెప్పారు. వరిలో జింకు లోపం కనపడే అవకాశం ఉందని, నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

- నేరుగా విత్తిన వరి, చెరకు, సజ్జ, మొక్కజొన్న, అపరాల పొలాల్లో నీరు నిలవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ వర్షాల కారణంగా రాగి నారుకు అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని, కార్బెండజిం 1 గ్రాము లేదా ట్రైసైక్లోజోల్ 0.5 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసి నివారించవచ్చు చెప్పారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న తేమను ఉపయోగించుకుని రాగి నారును నాటుకోవాలని సూచించారు.
- వర్షాధార చెరకులో పై పాటు ఎరువులు వేయని రైతులు వర్షాలను ఉపయోగించుకుని యూరియాను ఎకరానికి 50 కిలోల చొప్పున మొక్కల పక్కన చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు.
- 30 రోజుల లోపు వయసుగల వేరుశనగ పంటలో మొదలు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, తెగులు ఆశించిన మొక్కలను తీసివేసి, తెగులు ఆశించిన చోట కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో పిచికారీ చేయాలని సూచించారు.
- నువ్వు పైరులో కాండం కుళ్లు తెగులు/వేరు కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు కార్బెండజిం ఒక గ్రాము లేదా మంకోజేబ్ 3 గ్రాములను లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలన్నారు. -భీమ (ఎంటీయూ 1140) రకం వరి విత్తిన 10 రోజుల వరకు ముంపును తట్టుకుంటుందని, విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ కాలం మునిగి ఉంటే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఎంటీయూ 1232 రకంవిత్తిన 15 నుంచి 70 రోజుల వరకు ముంపును తట్టుకుంటుందని, మునిగిన నారుమడిలో నీటిని 5 రోజుల లోపు పూర్తిగా బయటకు తీసి వేసిన తర్వాత, 5 సెంట్లు నారుమడికి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక గ్రా కార్బెన్డిజిమ్ లేదా 2 గ్రాముల కార్బెన్డిజిమ్, మాంకోజెబ్ పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు కె.వి. రమణ మూర్తి, వి.గౌరి, బి.భవాని, సీహెచ్. రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

## పెట్రోలు ట్యాంకర్‌కు రంధ్రం

- అప్రమత్తమై కశింకోట బంకులో అన్‌లోడ్


అగ్నిమాపక సిబ్బంది భద్రతతో ట్యాంకర్ నుంచి పెట్రోల్ అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

**కశింకోట:** విశాఖ నుంచి తూర్పు గోదావరి జిల్లా పారావిల్‌కు 12 వేల లీటర్ల పెట్రోల్ తీసుకెళ్తున్న ట్యాంకర్‌కు గురువారం మార్గమధ్యంలో రంధ్రం పడింది. వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కశింకోట వద్ద బీపీ బంకులో పెట్రోల్‌ను అన్‌లోడ్ చేశారు. అదే సమయంలో సమాచారం తెలుసుకున్న స్థానిక హౌసింగ్ కాలనీ వాసులు ఇక్కడ లీకేజీ ట్యాంకరుతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే అగ్నిమాపక దళ సిబ్బందిని రప్పించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సీఐ వినోద్‌బాబు పర్యవేక్షణలో పెట్రోల్ అన్‌లోడ్ సవ్యంగా సాగి ట్యాంకర్ వెళ్లిపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

## కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ నేతలు


కలెక్టర్ విజయకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

**తుమ్మపాల:** ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపికను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని వారు కోరారు. శాంతి భద్రతలను కాపాడడంతో పాటు గోవులఅక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.వి.ఎస్. వర్మ, పట్టాబి ప్రసాద్, ఎ.కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పాలమరశెట్టి నాగేశ్వరరావు, వనం సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు ఓరుగంటి నాగమణి, సంతోషి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానికవారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం రూ.80 ఉన్న ధర రూ.60కి దిగింది. బంగాళాదుంపలు మాత్రం కిలో రూ.40 నుంచి రూ.50కి చేరాయి. ఉల్లిపాయ, దొండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, బెండకాయ, వంకాయ, చేమదుంప రూ.50, బీరకాయ రూ.60, పచ్చిమిర్చి రూ.120కి విక్రయాలు సాగాయి.

### ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



మారేడుపూడి సర్వే నెం.353లోని ప్రభుత్వ భూమిలో గోతులు తవ్వి, నిర్మాణ సామగ్రి వేసిన దృశ్యం

అనకాపల్లి: జీవీఎంసీ విలీనగ్రామం మారేడుపూడి సర్వే నెం.353, 385లో ఉన్న ప్రభుత్వ భూముల ఆక్రమణకు రంగం సిద్ధమయింది. గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను అధికార పార్టీ నేతలు బుధవారం రాత్రి తొలగించి, భవన నిర్మాణానికి ఏర్పాట్లు చేయడంపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఈ భూముల రక్షణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే, ప్రస్తుత కూటమి నేతలు వాటిని తొలగించి, దర్జాగా కబ్జా చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ భూమిలో నిర్మాణం కోసం గోతులు తవ్వి, నిర్మాణ సామగ్రిని కూడా వేశారు. దీనిపై అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఘనంగా యల్లారమ్మ ఉత్సవం



కశింకోటలో యల్లారమ్మ ఉత్సవ ఊరేగింపులో భక్తులు

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీకి ప్రజలు యల్లారమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని డప్పులు, బాణ సంచాతో ఊరేగించారు. హౌసింగ్ కాలనీ నుంచి ప్రారంభమైన ఊరేగింపు సంతబయల మీదుగా శారదానది అమ్మవారి గుడి వరకు సాగింది. ప్రజలు భారీ సంఖ్యలో దర్శించుకుని, అమ్మవారిని పూజించారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 10 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ఠ ధర | గరిష్ఠ ధర |
|---|---|---|
| మొదటి రకం | -- | -- |
| రెండో రకం | -- | -- |
| మూడోరకం | 3,500 | 3,500 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| డెడ్‌పూల్ వుల్వరీన్ | : రాజా |
| కల్కి 2898ఏడీ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| డెడ్‌పూల్ వుల్వరీన్ 3డీ తెలుగు | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| రాయన్ | : పర్తిసాయి |
| డార్లింగ్ | : షిర్డిసాయి |
| పురుషోత్తముడు | : వెంకటేశ్వర |
| రామ్ ఎన్ఆర్ఐ | : శ్రీసత్య |
| ఆపరేషన్ రావణ్ | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-24 యూనిట్లు, ఓ పాజిటివ్-32 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 366 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# అభయారణ్యం.. ఆహ్లాదకరం

మండలంలోని బయ్యవరం అభయారణ్యం వద్ద కొత్త అందాలు కొలువుదీరుతున్నాయి. స్థానిక ప్రజలకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు 'నగర వనం' పేరిట పార్కు సిద్ధమవుతోంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో దీన్ని నిర్మిస్తున్నారు. ఎటు చూసినా పచ్చదనంతో కనువిందు చేసే అటవీ ప్రాంతంలో.. అచ్చంగా అటవీ జంతువులను తలపించే ప్రతిమలు.. ప్రకృతి అందాలను ఆస్వాదించేలా ఏర్పాటు చేసిన పగోడాలతో ఈ పార్కు ప్రజలకు మరింత ఆహ్లాదాన్ని పంచనుంది.

- బయ్యవరం వద్ద 'నగర వనం' నిర్మాణం
- పెద్దలకు ఆహ్లాదం.. పిల్లలకు విజ్ఞానం
- రూ.1.30 కోట్లతో అటవీశాఖ ఏర్పాటు



ప్రహరీకి రంగులు వేస్తున్న కూలీలు



బయ్యవరం వద్ద నిర్మిస్తున్న నగర వనం

కశింకోట: వారాంతపు సెలవు దినాల్లో పార్కుల్లో సేదతీరేందుకు పట్టణాలకు, నగరాలకు పరుగుతీయనక్కర్లేదు. చేరువలోని అటవీ ప్రాంతాలు ఆహ్లాదకర ఉద్యాన వనాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అనకాపల్లి-యలమంచిలి మార్గంలో జాతీయ రహదారిని ఆనుకుని బయ్యవరం రైల్వే వంతెన వద్ద సుమారు 600 ఎకరాల అభయారణ్యం(రిజర్వ్ ఫారెస్ట్)లోని 25 ఎకరాల్లో నగర వనాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు అటవీ శాఖ రూ.కోటీ 30 లక్షలు వెచ్చిస్తోంది.

**కంబాల కొండ తరహాలో నిర్మాణం**

విశాఖలోని 'కంబాల కొండ'తరహాలో దీని నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే చుట్టూ చదును చేసి, మట్టి రోడ్లు వేశారు. సందర్శకులు, పిల్లలు సేద తీరేందుకు వీలుగా ఇనుప కమ్మీలతో నాలుగు పగోడాలు నిర్మిస్తున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్‌ను వనం చుట్టూ సిద్ధం చేస్తున్నారు. పరిసర గ్రామాల ప్రజలు వాకింగ్ చేసి, ప్రశాంతమైన వాతావరణంలో కాసేపు సేదతీరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**విజ్ఞానాన్ని పెంచే ఎడ్యుకేషన్ సెంటర్**

నగర వనంలో అటవీ శాఖ సమాచారంతోపాటు, జంతువులు, పక్షులు తదితర జీవరాశుల గురించి ప్రజలు, పిల్లలు తెలుసుకునేందుకు వీలుగా ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జంతువులు మన కళ్లముందున్నట్లే.. నమూనాలను సిద్ధం చేస్తున్నారు. స్థానిక అటవీ ప్రాంతంలో ఉండే జీవులతోపాటు, కనుమరుగయ్యే దశలో ఉన్న జంతువులు, పక్షుల గురించి తెలిసేలా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. కుటుంబాలతో సహా వచ్చి, ఆనందంగా కొన్ని గంటలు గడపాలనుకునేవారి కోసం ఆహారపానీయాలు అందుబాటులో ఉండేలా క్యాంటీన్ సదుపాయం కల్పిస్తున్నారు. ఇప్పటికే మరుగుదొడ్లు, నగర వనం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయింది. ప్రహరీకి అందంగా రంగులు వేస్తున్నారు.



పార్కు చుట్టూ నాటిన వెదురు మొక్కలు



ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు

**ఆహ్లాదకరంగా ఉండేలా..**

పార్కులో ఎటుచూసినా ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పార్కు చుట్టూ వెదురు మొక్కలు నాటారు. ఇతర అరుదైన, అలంకరణ మొక్కలను కూడా నాటి సందర్శకులకు కనువిందు కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) జగన్నాథ్‌సింగ్, ఫారెస్టు రేంజర్ జ్యోతిర్మయిల పర్యవేక్షణలో నగర వనం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రవేశద్వారం, సెక్యూరిటీ గది, టికెట్ల కౌంటర్ నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాణం పూర్తయి, ప్రజలకు అందుబాటులోకి వస్తే, నియోజకవర్గానికి మణిహారంగా మరుతుందనడంలో సందేహం లేదు.

**నామమాత్రపు ప్రవేశ రుసుం**

డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ నగర వన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. రిజర్వ్ ఫారెస్ట్‌లో దీన్ని ఏర్పాటు చేయడం స్థానికులకు మంచి విడిదిగా మారనుంది. పిల్లలు, పెద్దలు కూడా ఆనందించేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. దీని ప్రవేశానికి టికెట్ ధర నిర్ణయించాల్సి ఉంది. నామమాత్రపు టికెట్ ధరలే ఉంటాయి. నిర్మాణాలన్నీ పూర్తి చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

–కె.కాశీప్రసాద్, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్, అనకాపల్లి

## ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్

అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ కోరారు. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దుచేసి, జీవో ఎంఎస్ నెం.55(23-4-2021) ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతోపాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని కోరారు. హైస్కూళ్లలో రెండు మాధ్యమాలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధ నేతర పనుల నుంచి మినహాయించి, పని భారం తగ్గించాలని, హైస్కూళ్లలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని నివేదించారు. స్థానిక ప్రాంతాల పరిస్థితుల ఆధారంగా మధ్యాహ్న భోజనం మెనూ సవరించాలన్నారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్ సమస్య, కోవిడ్ సమయంలో మరణించిన మోడల్ స్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు జరపాలని విన్నవించారు. వీటితోపాటు ఉపాధ్యాయులు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు ఎ.ప్రకాష్, అప్పారావు, బండారు శంకర్, మాకిరెడ్డి రాజునాయుడు, సలీం, గొంది ఈశ్వరరావు, దేముడు నాయుడు, మామిడి బాబూరావు, ఆశ, తేజ్‌వర్ధన్, శివయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ధర్నా




ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌వో విద్యార్థులు

అనకాపల్లి: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ కాలానుకూలంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేలా వ్యవహరించాల్సిన ప్రభుత్వాలు, మారుతున్న ప్రతిసారీ విద్యా రంగాన్ని నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. గాంధీనగర్ ఎస్సీ కాలేజీ హాస్టల్‌కు కొత్త భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో ఖాళీ పోస్టుల్ని త్వరితగతిన భర్తీ చేయాలన్నారు. అనకాపల్లి నుంచి నర్సీపట్నం, తట్టబందకు వెళ్లే బస్సుల సంఖ్య పెంచాలని, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందించాలని, ఇంటర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల్ని భర్తీ చేయాలని, గెస్ట్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. డిగ్రీలో ఇంటర్న్‌షిప్ తొలగించాలన్నారు. జీవో నెం.117 రద్దు చేసి మూతబడిన ప్రభుత్వ స్కూళ్లను తెరిపించి, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 50 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ అధికారి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ధర్నాలో పీడీఎస్‌వో జిల్లా కో కన్వీనర్ ఎం.జానకిరామ్, నాయకులు ఎం.చందు, ఎస్.గరగనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ సభ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి



కశింకోట పంచాయతీ గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రమేష్

కశింకోట: స్థానిక పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పలువురు సభ దృష్టికి తెచ్చారు. అక్రమ కుళాయి కనెక్షన్లను, కుళాయిలకు అమర్చిన మోటార్లను తొలగించాలన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పోగవుతున్న చెత్తను ఊరికి దూరంగా తరలించాలని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో అవసరమైన చోట రోడ్లు, కాలువలు నిర్మించి అభివృద్ధి చేయాలని కోరారు. వీటిపై పంచాయతీ కార్యదర్శి రమేష్ వివరణ ఇస్తూ కుళాయిల అక్రమాలపై చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ జనాభా అత్యధికంగా ఉన్నా పన్నుల రూపంలో తప్ప, మరే మార్గంలోనూ ఆదాయం రావట్లేదన్నారు. సభలో సర్పంచ్ మంత్రి జయరజని, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచ్ గళ్లా కొండలరావు, కూటమి నాయకులు దాసరి బాబు, జనార్దన్, వేగి రామకోటేశ్వరరావు, ఆడారి నరసింగరావు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామీణ సమస్యలు పరిష్కరించాలని వినతి



గ్రామీణ ప్రాంత సమస్యలపై సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్ష నేతలు

తుమ్మపాల: గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు నేతృత్వంలో అఖిలపక్ష నేతలు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ పరిధి మూలపేటలో అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి వెంటనే పూర్తి చేయాలన్నారు. విచ్చలవిడిగా సంచరిస్తున్న పందుల వల్ల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వీధి కుక్కల నియంత్రణ చేపట్టాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నేత కట్టుమూరి నూకఅప్పారావు, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చినఅప్పారావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి కొల్లి సత్యారావు, ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక జిల్లా అధ్యక్షుడు పెట్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం



పరవాడ సినిమాహాలు కూడలిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీతో పాటు ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. బడ్జెట్ కేటాయింపులకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాలు కూడలిలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్యం తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదన్నారు. పదేళ్ల నుంచి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయకపోగా స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయింపు లేవన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి 15 వేల కోట్లను వివిధ సంస్థల ద్వారా ఇప్పిస్తామని చెప్పడం చూస్తే..అప్పులుగానే బావించాల్సి ఉంటుందన్నారు. బీజేపీతో దోస్తీ కట్టిన టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఒత్తిడి తీసుకువచ్చి నిధులు కేటాయించడంలో పూర్తిగా విఫలమయ్యాయని గనిశెట్టి దుయ్యబట్టారు. రైతాంగానికి అవసరమైన ఎరువుల రాయితీకి పెద్ద ఎత్తున కేటాయింపులు తగ్గించారన్నారు. వ్యవసాయ కూలీలకు పనులు కల్పించే ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించారని గనిశెట్టి ఆరోపించారు. సీఐటీయూ నాయకులు కె.నాయుడు, శ్రీను, అప్పారావు, రమణ పాల్గొన్నారు.

## రికార్డులు లేని వాహనాల సీజ్



సీజ్ చేసిన రికార్డులు లేని వాహనాలు

పరవాడ: మండలంలో మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో రికార్డులు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు. వీటి యజయానులు ఎవరైనా పరవాడ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## ఆటపాటలతో శిక్షా సప్తాహ్



తుమ్మపాల: నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు



కశింకోట బాలికల హైస్కూల్లో లఘు నాటిక ప్రదర్శనలో విద్యార్థినులు



రాధాకృష్ణుల వేషధారణలో బాలికలు

తుమ్మపాల/కశింకోట: నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ నాలుగో రోజు విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో వేడుకగా జరిగింది. బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లోని దేశభక్తి గీతాలతో పాటు, పలు రకాల పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. తుమ్మపాల, మార్టూరు, కొండుపాలెం, మంత్రిపాలెం, కూండ్రం జెడ్పీ హైస్కూళ్లలో ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా గురువారం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పాటలు, పద్యాలు పాడటంతోపాటు నృత్యాలు చేశారు. హెచ్ఎం ఎంవీఆర్ అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక బాలికల హైస్కూల్లో కూడా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా లఘు నాటికలు, డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని హెచ్ఎం ఎం.ఎస్. స్వర్ణకుమార్ అన్నారు. కార్యక్రమంలో పీడీ పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అభిరాంకు అభినందన



అభిరాంను అభినందిస్తున్న ఎంఈవోలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్‌కి చెందిన వై.అభిరాం నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సందర్భంగా గురువారం జ్ఞాపికను అందజేసి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఘన విజయాలు సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకు రావాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవోలు చిట్టిబాబు, మూర్తి, సీఆర్‌పీ పందిరి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ విజయ కృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీజీఈఏ పాలకవర్గ సభ్యులు

సబ్బవరం: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ను గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా యూనిట్ మర్యాదపూర్వకంగా కలిసింది. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షుడు జీవీ రమణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బాబూరావు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పి.అప్పారావు, కార్యవర్గ సభ్యులు సుధాకర్, శ్రీనివాస్, జిలాని, నక్కపల్లి యూనిట్ సభ్యురాలు గిరిజా జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మునగపాక: వర్షాల కారణంగా నారు మడులు మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. మండలంలోని అరబుపాలెం సచివాలయంలోని అధికారులకు ఈ మేరకు గురువారం వినతి అందజేశారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, కొత్తపల్లి, ఏఎస్ పేట, సోమవరం, కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం, ఏనుగుతుని, అచ్చెర్ల, మోసయ్యపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.



## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

సబ్బవరం: ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ పిన్నంటి రమణ గురువారం హెచ్చరించారు. సబ్బవరంలోని కళాశాలలు, పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో కొందరు ఆకతాయిలు విద్యార్థినులను వెంబడించి ర్యాగింగ్‌కు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన కూడళ్లు, ఆటో స్టాండ్‌ల వద్ద పోలీస్‌ల నిఘా ఏర్పాటు చేశామన్నారు. బైకులపై అతివేగంగా వెళ్లేవారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.